


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏ 'ట్యూబ్' అయినా జాగ్రత్త!

**మా కోడలు** పొద్దుటే లేచి ఏదో దీక్షగా చూస్తోంది లాప్‌టాప్‌లో. నేను మా అబ్బాయితో "పాపం ఆదివారం కూడా పనేనా?" అన్నాను.

వాడు పెద్దగా నవ్వి "ఓ అభిమాన రేపర్ గురించి ఫ్రెండ్ ఏదో చెపితే సెర్చ్ చేస్తోంది" అన్నాడు.

నేను ఆ అమ్మాయి పాడిన పాటలేమో అనుకుని, కాఫీ ఇస్తున్నప్పుడు చూస్తే పెద్ద డాక్యుమెంట్ చూస్తోంది లాప్‌టాప్‌లో.

"దిస్ ఈజ్ హర్ డివోర్స్ డాక్యుమెంట్ అమ్మా. షి పోస్టెడ్ ఇట్" అంది.

నేను ముక్కు మీద వేలేసుకోలేదు కానీ అంత పని చేసాను. "ఇవన్నీ 'ఇన్‌స్టా'లో 'ట్విట్టర్'లో పోస్ట్ చేసుకుంటారా?" అన్నాను.

"ఆ కావమ్మ కొడుకూ కోడలూ వేరు కాపురం పెట్టారుట వదినా!"

"ఆ వెనక వీధి మా లచ్చిమి కూతురు, ఆ రెండోది, మగపిల్లాడులా లాగూ చొక్కా వేసుకుని తిరుగుతుండే అది లేచిపోయిందట తెలుసా?", "మా కేశవుల మావయ్య కొడుకు నారిగాడిని లంచం తీసుకుంటున్నాడని, ఆఫీస్‌లో పోలీసులు పట్టుకున్నారట"

ఇలాంటి వార్తలూ, కొన్ని వదంతులూ మోసుకొచ్చి, ఒక కాఫీ తాగి వెళ్ళడానికి ఇదివరకు మూర్తి మావయ్యలో, పక్కింటి పంకజాక్షిలో ఉండేవారు.

"వదినా! ఓ మారు ఇలారా" అని గోడమీద నుండి పిలిస్తే, సుందరి కాలుస్తున్న రొట్టె పెనం మీదే వదిలేసి పరిగెత్తేది.

"ఆ అలివేలు మొగుడు రెండో పెళ్ళి చేసుకున్నాడట. పైగా పిల్లలు కూడా ఉన్నారట ఆమెకి. "

"అయ్యో! ఇప్పుడు అలివేలు పరిస్థితేమిటొదినా? పెద్దది పెద్ద మనిషి కూడా అయినట్లుంది"

ఇవన్నీ గోడమీదనుండి అయ్యేలోగా పెనం ఏదో, పెనం మీద పెంకలా మాడిన రొట్టె ఏదో తెలిసేది కాదు. పైగా ఆ పొగలు గింగిరాలు తిరుగుతూ వాళ్ళిద్దరి ముచ్చటలకి అంతరాయం కలిగిస్తే దగ్గుతూ, ఆ వేడీ, పొగా చర్చిస్తున్న తమ విషయంలోది అనుకునేవారు పంకజం, సుందరీనూ.

వాటినే స్పైసీ కబుర్లు అనీ, ఈ గాసిప్స్ కాలమ్ లేకపోతే లైఫ్‌లో స్పైస్ చచ్చిపోయి లైఫ్ డల్ అయిపోతుందనీ అంటున్నారు ఇప్పటి జనరేషన్. ఆ స్పైస్ కోసం ఈ ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్‌లో వ్లాగ్స్, ఇన్‌స్టాగ్రామ్‌లు. నడక నేర్చిన పసివాడి నుండీ నడ్డి వొంగిన ముసలివాళ్ళదాకా, ఇవన్నీ కావాలి. అసలు యూ ట్యూబ్‌ల్లో వ్లాగ్స్ అంటూ ఇంట్లో జరిగేవన్నీ వీడియోలు తీసి అప్‌లోడ్ చెయ్యడం వచ్చాక, కాపురాలు వీధిన పడ్డాయి. పైగా వాటికి లైఫ్ స్టైల్ వీడియోస్ అని పేరు.

ఒకింట్లో మొగుడు దోశలు వేస్తుంటాడు "చూడండి మా అభీగాడు దోశ ఎలా మాడ్చేస్తున్నాడో. ఛీ..ఛీ ఎన్ని సార్లు చెప్పిన ఇంతే బాబూ" అని కెమెరా అతని మొహం మీద పెడ్తుంది ఓ ఇల్లాలు.

"నేను బనీన్ కూడా వేసుకోలేదే కెమేరా ఆఫ్ చెయ్యి.. ఆఫ్ చెయ్యి" అని ఆ మొగుడు మొత్తుకుంటున్నా సరే. ఇంకో ఇంటికోడలు గుండెపట్టుకుని ఆయాసపడ్తున్న మావగారిని చూపిస్తూ "మావయ్యకి ఎటాక్‌లా వుంది పాపం కొట్టుకుంటున్నారు" అంటుంది. ఈవిడ వీడియో తియ్యడం అయి వ్లాగ్ అప్‌లోడ్ చేసాక "మావయ్య పోయి రెండో దినం అవుతుంది" అంతలా ముదిరిపోయాయి పిచ్చిలు. అతిశయోక్తి అనుకున్నా సరే.

"నా గోల్డ్ జ్యూవెలరీ. ఇవన్నీ నేను ఇంట్లోనే నా అల్మారాలోని సేఫ్‌లో పెట్టుకుంటాను. ఈ వంకీలూ, వడ్డాణం, జుంకీలూ ఇక్కడ అమెరికాలో తెలుగు ఫంక్షన్స్‌కి పెట్టుకోవడానికి. బ్యాంక్ లాకర్‌లో ఏవీ పెట్టను. చూసారా మేంగో డిజైన్. ఇది కాసుల పేరు. వడ్డాణం అరవై కాసులు అయింది" ఇలా విపులంగా అరటి పండు తొక్క వలచి చూపిస్తూ, ఒక్కోటీ ముక్కూ మొహం తెలియని కోట్లాది జనాభాకి యూ ట్యూబ్‌లో చూపిస్తుంది ఓ యూ ట్యూబర్. అందులో దొంగ వెధవలు ఎంతమందో ఎవరికి తెలుసు?

"అక్కా మీ పాపాయి ముద్దుగా వుంది ఎడ్రస్ ఇస్తావా బర్త్‌డే కి గిఫ్ట్ పంపిస్తా" అనగానే "అయ్యో తమ్ముడూ నేనంటే నీకెంత అభిమానం మెయిల్‌లో ఇస్తా మెయిల్ ఐడి. ఇయ్యి" అంటుంది.

ఇతను ఇన్‌బాక్స్‌లో మెయిల్ ఐడి ఇస్తాడు. ఆవిడ అడ్రెస్ పెడ్తుంది.

ఆ తరువాతి వారం గిఫ్ట్ పట్టుకుని ఇద్దరు డెలివరీ బాయ్స్ వస్తారు. అక్కాయ్ అల్మారా, సేఫ్ అన్నీ వాళ్ళకి కొట్టిన పిండే మేంగో డిజైన్ చెయిన్స్, శ్రీరామ పట్టాభిషేకం గొలుసూ, వడ్డాణం, జుంకీలూ, ఇంట్లో చేతికి వేసుకునే నాలుగు జతల గాజులూ, దాపుడికుంచిన ఎర్రరాళ్ళవీ, డైమండ్‌వీ అన్నీ గోవింద. బావ ఆఫీస్ టైమింగ్స్, తను ఒక్కతే వుండే సమయం పాప స్కూల్ టైమింగ్స్ అన్నీ విపులంగా అక్కాయ్ చెప్పిందిగా 'వ్లాగ్'లో. ఇదీ ఈ వ్లాగ్‌లో వాగుడికి పర్యవసానం. ఆ యూ ట్యూబ్ వాడు ఈలోగా ఇచ్చే సిల్వర్ బటన్ కోసం ఆతృత. బావగారికి యావజ్జీవితం దేశం కాని దేశంలో వెట్టి చాకిరీ చేసి సంపాదించినదంతా 'ఉష్ కాకి'

అసలు సంసారానికో గుట్టు లేదు. మరుగూ లేదు. "మా వారికి ఇంత వస్తుంది. ఇంటి ఖర్చు ఇంత, మా అత్తమ్మోళ్ళకి ఏం ఇవ్వం. ఎందుకంటే ఇక్కడ పిల్లలు పుడితే అమెరికాలో ఖర్చెక్కువ. పోయినేడు అత్తయ్య వచ్చినప్పుడు ఆవిడ జారిపడ్డారు. ఇన్ని వేల డాలర్స్ అయ్యాయి అందుకే ఇంక రావద్దు అని చెప్పేసాం" ఇలా ఇంటి విషయాలు అన్నీ అస్సలు తెలీని వాళ్ళతో పూసగుచ్చినట్లు చెప్పేస్తున్నారు.

యూ ట్యూబ్‌లో సంసారాన్ని రచ్చకీడ్చాక జనం ఆగుతారా. వాళ్ళ నోటికి అడ్డూ ఆపూ ఉండదు. ఆపలేం కూడా. వాళ్ళు ఏవేవో కామెంట్స్ పెడ్తారు. అందులో అశ్లీలమైనవీ ఉంటాయి. హర్ట్ చేసేవీ ఉంటాయి. ఆ వెంటనే ఇంకో వ్లాగ్‌లో భోరున ఏడుస్తూ "నేను మా అమ్మవాళ్ళు వచ్చినప్పుడు మూడుసార్లు ఫిష్, నాలుగు సార్లు చికెన్ వండానట. మా అత్తగారొచ్చినప్పుడు రసం పెట్టి అప్పడాలు మాత్రం వేయించానట. ఎవరో ఇట్లా కామెంట్ పెట్టారు. ఇది చూసి మా ఆడబిడ్డ ఫోన్ చేసి గంటసేపు వాయించింది. మా ఆయన రాత్రి వేరే గదిలో పడుకున్నాడు. మీకు న్యాయంగా వుందా ఫ్రెండ్స్?" అంటూ. దానికి థంబ్ నెయిల్ "మా ఆయన వేరే గదిలో పడుకుంటున్నాడు" ఇదీ వీళ్ళ భాగోతం.

ఇంకా కొంతమంది "మా ఆయన బాస్ చాలా పిసినారిట. ఆఫీస్‌లో న్యూస్ పేపర్స్ కూడా బోయ్‌ని ఇంటికి తెచ్చిమ్మని అమ్మేసుకుంటాడుట. వాళ్ళావిడ ఇంకానూ. మహా తల్లి ఇంటికెళ్తే మంచి నీళ్ళు కూడా ఇవ్వదు అని వసపిట్టల్లా ఫ్లోలో 'ఫోర్ కాస్ట్' గురించి ఆలోచించకుండా వాగేస్తారా. ఆ వ్లాగ్ ఆ ఆఫీసర్ పెళ్ళాం తన మిత్రురాళ్ళతో కలిసి చూస్తుంది "ఈ చండిరాణి మీ ఆయన ఆఫీస్‌లో మీవారి కింద పనిచేసే గురగురరావు పెళ్ళాం కదూ" అంటుంది అందులో ఒకావిడ. అంతే బాంబ్ ఫెటీల్మని బద్దలవుతుంది.

ఆ తర్వాత ఆ చండీరాణి వ్లాగ్స్‌లో మొగుడి ఉద్యోగం పోయిందని ఏడుస్తూ "తెలిసిన వాళ్ళతో షేర్ చెయ్యండి. లైక్ చేసి, సబ్‌స్క్రైబ్ చెయ్యండి ప్లీజ్" అని కళ్ళు తుడుచుకుంటూ అభ్యర్థిస్తూ వుంటుంది. ఇది ఒక వ్యసనం. ఎన్ని అనర్థాలు జరిగిన సోషల్ మీడియాలో పబ్లిసిటీ, సెలబ్రెటీ స్టేటస్ మీడియాలో పబ్లిసిటీ, సెలెబ్రెటీ స్టేటస్ కావాలి. ఏ ఎయిర్‌పోర్ట్‌లోనో, సూపర్ మార్కెట్‌లోనో జనం గుర్తుపట్టి పలకరించి "మీరు ఫలానా చండిరాణి కదూ. మీ వ్లాగ్స్ చూస్తుంటాం అండి. పాపం అన్నయ్యగారి చేత అంతలా అంట్లు తోమించకండీ" అనాలి. వీళ్ళకి కావల్సింది అదీ. ఇంకో కోడలు భయంకరమైన వంటలన్నీ అత్తగారి చేతచేయించి పెడ్తుంటుంది. ఆ అత్తగారు పాపం బలహీనంగా ఉంటుంది. ఆ ప్రాంతం యాసలో ఏదో చెప్తూ ఆ వంటలు పెడ్తుంది. ఎవరికీ ఆ భాష అర్థంకాదు. ఇల్లు బట్టలతో, పాత పేపర్లతో చిందరవందరగా ఉంటుంది. శుభ్రత ఉండదు. కోడలు మాత్రం 'టింగు'మని తయ్యారయి వీడియో పెడ్తుంది. ఇంక ఈ విషయం పెట్టాలీ, ఈ విషయం పెట్టకూడదు అని లేదు. భర్తతో అంతరంగిక విషయాల నుండి, గర్భం రావడం, డెలివరీ, వాటర్ బ్రోక్ దాకా వీడియోస్ తీసి పెడ్తారు. లైక్‌లకీ సబ్‌స్క్రిప్షన్‌లకీ డబ్బులొస్తాయటకదా! చెత్త ఏరుకునేవాళ్ళూ, దొంగతనాలు చేసేవాళ్ళూ, బాగా సంపాదించి ఏం చెయ్యాలో తెలిని వాళ్ళూ అందరూ ఒక్క ఎగన యూ ట్యూబ్‌ల మీద పడ్డారు. అన్నింట్లో ఈజీ వంటల వ్లాగ్స్. బాగా చేస్తే ఫరవాలేదు. కొంతమంది చేసే వంటలు వాళ్ళకే అర్థంకాదు. ఉప్మా చెయ్యడానికి 24 స్టెప్స్. ఇలా నోట్స్ రాసుకోండి. ముందు పోపు దినుసులు ప్లేట్‌లో వేసుకోవాలి. అవి శుభ్రం చేసుకోవాలి పురుగులుంటే అవతల పారెయ్యాలి. ఇలా సాగుతుంది ఆ నోట్స్.

కొన్ని వ్లాగ్స్ ఉపయుక్తంగా ఉంటాయి. ఒక జంట యూరప్‌లో పర్యాటనకి అనువుగా అన్ని వివరాలూ, టూరిస్ట్ స్పాట్స్, బుకింగ్‌లూ, ఆ ఖర్చులూ, అక్కడ దొరికే ఫుడ్, ఎంత కరీదో, అక్కడ కిచెన్ ఇస్తారు ఎకామిడేషన్‌లో కాబట్టి, ఏమేం తీసుకెళ్ళాలో అన్నీ చెప్తుంటారు "దేశీ కపుల్ ఆన్ గో" అని. ఇలాంటివి చాలా ఉపయోగం.

కానీ నేను మొదట చెప్పినట్లుగా ఇంటి సంగతులన్నీ బయట వేసుకునే లైఫ్ స్టైల్ వ్లాగ్స్ వల్ల చాలా రిస్క్ వుంది. జాగ్రత్త పడమని నా ఉద్దేశం.

ఈ సోషల్ మీడియా వల్ల ఎంతలాభం వుందో, అంత ప్రమాదం వుంది.

ఈ మధ్య ఫేస్‌బుక్‌లో కొట్లాటలూ, ఏడుపులూ, తిట్లూ లాంటివే, యూ ట్యూబ్‌లలో చూస్తున్నాం. ముఖ్యంగా సెలెబ్రెటీలు ఏం ఎవరితో చెప్పాలన్నా ఫోన్ వాడడం లేదు. యూట్యూబ్‌లో మాట్లాడి వీడియోలు పెడ్తున్నారు. దానికి అవతలవాళ్ళు మళ్ళీ ఇంకో రిప్లై వీడియో పెడ్తారు. ఇది ఏం అంత ఆరోగ్యకరమైన అలవాటు కాదు. వీధిన పడడం కూడా కాదు 'నెట్'లో పడితే మళ్ళీ జారిన నోరూ, కాలూ తీసుకోలేరు.

అలాగే చిన్న పిల్లలున్నవాళ్ళు, పిల్లల స్కూల్ వివరాలూ, పాపల ఫోటోలూ, అన్నీ వ్లాగ్స్‌లో పెట్టేస్తున్నారు. కిడ్నాపర్స్‌కి ఎంత ఈజీ అవుతుందో ఆలోచించండి. పసిపాపలు కనపడడం లేదన్న వార్త టీ.వీలో చూస్తే నా గుండె ఆగినట్లు అవుతుంది. ఎవరి పిల్లలైనా ఒకటే. అభం శుభం తెలియని పసివాళ్ళు. మీ సరదాలకి వాళ్ళ జీవితాలు పణం పెట్టద్దు. నేను సరదాగా రాసిన ఇవన్నీ మీరు సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయాలు.

ఇంక మొదటగా చెపితే, ఆ తర్వాత ఇంక ఏమీ రాయలేనని చివరగా చెప్తున్నాను. సెప్టెంబర్ 25, 2020 బాలూగారి అస్తమయం మనం ఎన్నటికీ పూడ్చుకోలేని లోటు. మన తెలుగు జాతి సంపద. విలువైన రత్నాన్ని కొల్లగొట్టారు. ఆ వైరస్ పుట్టించిన దుర్మార్గులు.

నేను రచయిత్రిగా మారిన తొలిరోజుల్లో ఆయన మేనల్లుడు శివలెంక కృష్ణప్రసాద్‌గారు తియ్యదలచిన సినిమాకోసం, గ్రీన్ పార్క్ హోటల్‌కి వెళ్ళి బాలూగారికి కథ చెప్పాను. అంతటి లెజెండ్ నన్ను రిసీవ్ చేసుకుని మాట్లాడిన తీరూ, ఆ అభిమానం, ఆదరణా మరవలేను. తన సూట్‌కేస్‌లోనుండి "ఒన్ ఫైన్ డే" అనే ఇంగ్లీషు సినిమా స్క్రీన్ ప్లే పుస్తకం తీసి దాంట్లో "మంచి రచయిత్రి బలభద్రపాత్రుని రమణిగారికి, అభిమానంతో బాలూ" అని సంతకం చేసి ఇచ్చారు. ప్రాణపదంగా ఇప్పటికీ ఆ బుక్ దాచుకున్నాను. దాదాపు గంటన్నర సేపు విఠల్ లోపలికి ఎవరినీ రానివ్వద్దు అని మిత్రుడు విఠల్ గారితోచెప్పి, శ్రద్ధగా నేను చెప్పినదంతా విని మెచ్చుకున్నారు. ఎన్నో కబుర్లూ, కథలూ చెప్పారు. సాహిత్యం గురించి ఆయనకెంత తెలుసో అని ఆశ్చర్యపోయాను. తర్వాత చాలాసార్లు కలిసాను. ఎప్పుడూ ఆప్యాయంగా మాట్లాడారు. 'పాడుతా తీయగా' ప్రోగ్రాంకి అమ్మని తీసుకెళ్తే "రమణిగారూ ముందుకి రండి" అని స్టేజ్ మీదనుండే చూసి గుర్తుపట్టి పిలిచారు. అందరినీ ఆనందపరిచేవారు.

ఒకరోజున సడెన్‌గా "నేను ఎస్.పి.బాలసుబ్రమణ్యాన్ని అమ్మా. మీతో పనిబడింది. మా మిత్రుడు వంగూరి చిట్టెన్ రాజుగారికి మా టీవిలో సీరియల్ కావాలి. మీరే చూస్తున్నారని తెలిసింది" అని ఫోన్ చేసి మాట్లాడారు.

నేను నవ్వి "ఆయన నాకూ చాలా కావలసినవారే" అన్నాను.


"అవును. మీరూ మీరూ రచయితలు కదా" అన్నారు

తర్వాత మా ఫ్రెండ్ సుమిత్రా పంపిన ఇంటి పక్క ఫ్లాట్ కొన్నారు. శ్రీనగర్ కాలనీలో, చాలాసార్లు లిఫ్ట్‌లో కారిడార్‌లో కలిసేవారు. ఆప్యాయంగా మాట్లాడేవారు.

శివలెంక కృష్ణప్రసాద్ గారు నాకు మిత్రులవడం వలన "ఊయల" షూటింగ్‌కి వెళ్ళినప్పుడూ, నేను స్క్రీన్ ప్లే చేసిన 'అనగనగా ఓ అమ్మాయి' షూటింగ్‌కి వెళ్ళినప్పుడూ, ప్రేమగా మాట్లాడేవారు. ఎప్పుడు కలిసినా ఇంట్లో మనిషిలా అనిపించేవారు. పరాయిగా, అమ్మో ఎంత గొప్పవారో, ఆచితూచి మాట్లాడాలి అని ఎన్నడూ అనిపించేదికాదు. హాస్యం ఆయన ప్రతిమాటలో తొణుకుతుండేది. నవ్వించేవారు. నవ్వుతూ ఉండేవారు. ఆ రూపమే నాకు గుర్తుంది. తెలుగు

వాళ్ళందరికీ గుర్తుంటుంది. ఆ పాట వున్నంత వరకూ ఆయన చిరంజీవిగా మన గుండెల్లో ఉంటారు. బాలుడికి అస్తమయం లేదు. ప్రతిరోజూ ఉదయిస్తూనే ఉంటారు ప్రతి పాటలో, ప్రతి వేకువలో.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4